కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ ఆఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి..
పారదర్శక విధానాలకు..
ప్రతిరూపం
MESARA
Infra Developers Limited

# రికార్డు స్థాయికి రైతు భరోసా!



**15 లక్షల మందికి కొత్త లబ్ధి!**

**రూ.73,320 కోట్ల భరోసా!**

**73 లక్షల రైతులకు అండ!**

**బోగస్ జాబితాపై కొరడా!**

**అర్హులకే రైతు భరోసా!**

**నిజమైన రైతులకే సాయం!**

**ఖరీఫ్ నిధుల జమ షురూ!**

**న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్)**తెలంగాణలోని రైతులను ఆదుకునేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పంట పెట్టుబడి సాయం సరికొత్త మైలురాయిని అధిగమించింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో రైతు బంధుగా ప్రారంభమై.. ప్రస్తుతం రైతు భరోసాగా కొనసాగుతున్న ఈ పథకం కింద ప్రభుత్వం రైతులకు అందించిన మొత్తం నిధుల పంపిణీ ఏకంగా 46 శాతం పెరిగి రూ. 73,320 కోట్లకు చేరుకుంది. ప్రభుత్వ అధికారిక డేటా ప్రకారం.. 2018లో ఈ పథకం ప్రారంభమైనప్పుడు కేవలం భూమి ఉన్న సుమారు 58 లక్షల మంది రైతులకు మాత్రమే పెట్టుబడి సాయం అందేది. అయితే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం పరిధిని మరింత విస్తృతం చేస్తూ అర్హులైన వ్యవసాయ కూలీలను, కౌలు రైతులను కూడా ఇందులో భాగస్వామ్యం చేసింది. దీనివల్ల ప్రస్తుతం లబ్ధిదారుల సంఖ్య 73 లక్షల మార్కును దాటింది.

మిగతాది 2 లో..

## ఆ మూడు బ్యారేజీల్లో నీళ్లు నిల్వ చేయలేం

**3-4 నెలల్లో ధరల పెంపు!**

**12-15% వరకు టారిఫ్ షాక్**

**మళ్లీ పెరగనున్న రీచార్జ్ భారం**

**ARPU పెంపే కంపెనీల లక్ష్యం**

**5G పెట్టుబడులే ప్రధాన కారణం**

**ప్రైవేట్ టెలికాం కొత్త వ్యూహం**




**న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్)** మొబైల్ వినియోగదారుల నెత్తిన మరో పిడుగు పడనుంది. భారతీయ టెలికాం రంగంలో రాబోయే మూడు నుండి నాలుగు నెలల్లో మొబైల్ ఛార్జీలు భారీగా పెరిగే అవకాశం ఉందని 'సెంట్రమ్ ఇన్స్టిట్యూషనల్ రీసెర్చ్' తాజా నివేదికలో అంచనా వేసింది. మార్కెట్ కన్సాలిడేషన్ తర్వాత ధరలు పెంచడానికి అనుకూలమైన వాతావరణం ఏర్పడటమే దీనికి కారణమని ఆ సంస్థ వెల్లడించింది. అంతర్జాతీయంగా పెరుగుతున్న ద్రవ్యోల్బణం, ఆర్థిక అనిశ్చితి కారణంగా ఇప్పటికే సగటు మానవుడు ఇబ్బందులు పడుతుండగా ఇప్పుడు మొబైల్ రీచార్జి కూడా మరింత ప్రియం కానుండటం సామాన్యుల బతుకులపై ఆర్థిక భారంగా మారనుంది.

## పహల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం

**హాఫీజ్ సయీద్ పేరు చేర్పు**

**లష్కర్ చీఫ్‌పై కఠిన అభియోగాలు**

**ఉగ్రకుట్రకు పక్కా ఆధారాలు**

**భారత్‌పై యుద్ధమే లక్ష్యం**

**పహల్గాం కేసులో కీలక మలుపు**

**26 మంది బలిగొన్న దాడి**




**న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్)** దేశంలో తీవ్ర విషాదం నింపిన ఏప్రిల్ 2025 పహెల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో లష్కరే తోయిబా, దాని అనుబంధ 'ది రెసిస్టెన్స్ ఫ్రంట్' వ్యవస్థాపకుడు, చీఫ్ హాఫీజ్ సయీద్‌పై పేరును ఎన్ఐఏ చార్జిషీట్‌లో చేర్చింది. ఈ కేసులో సోమవారం జాతీయ దర్యాప్తు సంస్థ సోమవారం అదనపు ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది.

## ఆరు రోజుల విదేశీ పర్యటన




మూడు దేశాల్లో కీలక భేటీలు

ఇండోనేషియాతో వ్యూహాత్మక బంధం

ఆస్ట్రేలియాలో ద్వైపాక్షిక చర్చలు

వాణిజ్యం, రక్షణపై ఫోకస్

## మహారాష్ట్రను ముంచెత్తిన వర్షం




13 మంది మృతి

ముంబైకి రెడ్ అలర్ట్

హైవేలపై ట్రాఫిక్ స్తంభనం

కొండచరియలు విరిగిపడిన ఘటనలు

లోనావాలాలో రికార్డు వర్షం

## ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్ర భగ్నం




నలుగురు ఉగ్ర అనుమానితుల అరెస్ట్

ధార్మిక స్థలాలపై రెక్కీ

పాక్ హ్యాండ్లర్లతో సంబంధాలు

విదేశీ పిస్టళ్లు స్వాధీనం

డ్రోన్ల ద్వారా ఆయుధాల సరఫరా

దేశంలో అశాంతే లక్ష్యం

## అయోధ్య విరాళాల చోరీ కేసు




ట్రస్ట్‌లో కీలక మార్పులు

చంపత్‌రాయ్ రాజీనామాకు ఆమోదం

విరాళాల అక్రమాలపై సిట్ దర్యాప్తు

కొత్త ప్రధాన కార్యదర్శిగా బాగ్రా

ఎనిమిది మంది ఇప్పటికే అరెస్ట్

**న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్)** అయోధ్య రామమందిర విరాళాల దుర్వినియోగం, నిధుల చోరీ ఆరోపణల వ్యవహారంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్, ట్రస్ట్ సభ్యుడు డాక్టర్ అనిల్ మిశ్రా రాజీనామాలను ట్రస్ట్ బోర్డు ఆమోదించింది. సోమవారం ఆలయ ప్రాంగణంలోని గెస్ట్ హౌస్ లో జరిగిన అత్యున్నతస్థాయి సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. చంపత్ రాయ్ స్థానంలో విశ్వహిందూ పరిషత్ అంతర్జాతీయ ప్రధాన కార్యదర్శి, చార్టర్డ్ అకౌంటెంట్ భజరంగ్ లాల్ బాగ్రాను కొత్త ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా నియమించారు.

రామమందిర నిర్మాణానికి వచ్చిన నిధుల అక్రమాలపై యూపీ ప్రభుత్వం సిట్ వేసిన విషయం తెలిసిందే. విరాళాల దుర్వినియోగంపై సిట్ విచారణను వేగవంతం చేసింది. సిట్ జరుపుతున్న దర్యాప్తుపై తమకు పూర్తి నమ్మకం ఉందని ట్రస్ట్ స్పష్టం చేసింది. తప్పు చేసిన వారు ఎవరైనా సరే శిక్ష తప్పదని ట్రస్ట్ అధ్యక్షుడు మహంత నృత్య గోపాల్ దాస్ పేర్కొన్నారు.

## హార్పిక్‌తో హత్య

**వివాహేతర బంధం కోసం హత్య**


**భర్తపై కిరాతక దాడి**

**హార్పిక్ ఇంజెక్ట్ చేసిన భార్య**

**నిజామాబాద్‌లో సంచలనం**

**పోలీసుల అదుపులో నిందితులు**

**దర్యాప్తులో వెలుగుచూసిన నిజాలు**




**న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్)** పర పురుషుడి వ్యామోహంలో పడి, వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన భార్యలు, అమాయకులైన భర్తల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా అంతమొందించింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న ప్రశాంత్, సంధ్య దంపతులు నివాసం ఉంటున్నారు.

## టూరిజంపై సీఎం ప్రత్యేక ఫోకస్

### పర్యాటక అభివృద్ధికి కీలక ఆదేశాలు

తారామతి, దుర్గం చెరువుకు కొత్త రూపు

వికారాబాద్ టూరిజం హబ్‌గా తీర్చిదిద్దే లక్ష్యం

ఎకో టూరిజం ప్రాజెక్టులకు గ్రీన్‌సిగ్నల్

హెరిటేజ్ టూరిజంపై ప్రత్యేక దృష్టి

గ్లోబల్ సమ్మిట్‌కు ఇప్పటినుంచే సన్నాహాలు




## రావణ్‌లో మావోయిస్టు భావజాలం..

### వెలుగులోకి సంచలన విషయాలు




## ఉద్యోగుల బదిలీలపై నిషేధం

### కొత్త జోనల్ విధానానికి గ్రీన్‌సిగ్నల్

బదిలీలు, ప్రమోషన్లు నిలిపివేత

26 జిల్లాలకు స్థానిక కేడర్లు

6 జోన్లు.. 2 మల్టీ జోన్లు

ఉద్యోగుల కేటాయింపునకు మార్గదర్శకాలు

కేడర్ పూర్తి అయ్యే వరకు వెయిట్

రాష్ట్రపతి ఉత్తర్వులతో కీలక మార్పులు

స్థానిక కేడర్లపై సర్కార్ ఫోకస్

2 లో

# మొబైల్ యూజర్లకు షాక్..

మొదటి పేజీ తరువాయి




12-15 శాతం వరకు పెరిగే చాన్స్:

సామాన్యులకు షాక్ ఇస్తూ ఈ సారి ఏకంగా 12-15 శాతం వరకు టారిఫ్స్ పెరిగే అవకాశం ఉందని ఈ సంస్థ అంచనావేసింది. ప్రస్తుతం మార్కెట్లో కేవలం 3 ప్రైవేట్ + 1 ప్రభుత్వ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారని, అందువల్ల రాబోయే 3-4 ధరల పెంపు ఉండే అవకాశం ఉందని ఈ బ్రోకరేజ్ సంస్థ తన Q1FY27 టెలికాం అండ్ ఇంటర్నెట్ సెక్టార్ ప్రివ్యూ నివేదికలో తెలిపింది. ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ల 'వినియోగదారుడి సగటు ఆదాయం' (ARPU) త్రైమాసిక ప్రాతిపదికన (QoQ) 1-1.5 శాతం పెరిగే అవకాశం ఉందని అంచనా వేసింది. వినియోగదారులు 2G నుండి 4G, 5G నెట్‌వర్క్‌లకు మారడం, పోస్ట్‌పెయిడ్ కస్టమర్ల సంఖ్య పెరగడం మరియు ఈ త్రైమాసికంలో ఎక్కువ రోజులు ఉండటం దీనికి కారణాలని పేర్కొంది.

పెంపుపై కంపెనీల వ్యూహాలు:

నిజానికి గత కొంత కాలంగా టారిఫ్ ల ధరలు పెంచేందుకు టెలికాం సంస్థలు ప్రణాళికలు రచిస్తున్నాయి. G సేవలను ఉచితంగా అందించడం వల్ల కంపెనీలు ఆశించినంత లాభాల్లో లేవని తాము పెట్టిన భారీ పెట్టుబడులను తిరిగి రికవరీ చేసుకోవడంతో పాటు, ప్రతి కస్టమర్ నుండి వచ్చే సగటు ఆదాయాన్ని గణనీయంగా పెంచుకోవాలనే వ్యూహాత్మక ప్రణాళికతోనే ఈ టెలికాం కంపెనీలు టారిఫ్ ధరలు సవరించాలని చూస్తున్నాయి. ఈ క్రమంలో సెంట్రమ్ ఇన్‌స్టిట్యూషనల్ రీసెర్చ్ సైతం పెంపు ఉండబోతోందనే అంచనా ఇప్పుడు మొబైల్ యూజర్ల వెన్నులో వణుకు పుట్టించేలా మారింది.

# ఆరు రోజుల విదేశీ పర్యటన




న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) ప్రధాని నరేంద్ర మోడీ మూడు దేశాల పర్యటనకు ఇవాళ బయలుదేరి వెళ్లారు. ఆరు రోజుల పాటు సాగనున్న ఈ పర్యటనలో ఇండోనేషియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ దేశాల్లో ఆయన పర్యటించనున్నారు. పర్యటనకు ముందు ప్రధాని మోడీ తన అధికారిక ప్రకటనను విడుదల చేశారు. ఈ దేశాలతో ఆర్థిక, వ్యూహాత్మక భాగస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని ఈ సందర్భంగా ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబోవో సుబియాంతో ఆహ్వానం మేరకు తాను జులై 6 నుండి 8 వరకు ఆ దేశంలో పర్యటించనున్నట్లు తెలిపారు. ఈనెల 8,9 తేదీలలో ఆస్ట్రేలియాలో ఈ నెల 10,11 తేదీల్లో న్యూజిలాండ్ లో పర్యటించనున్నారు.

ఇండోనేషియాతో వ్యూహాత్మక బంధం:

2018లో తాను ఇండోనేషియాలో పర్యటించిన సమయంలో ఇరు దేశాల మధ్య కుదిరిన 'సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' ఈ పర్యటన మరింత బలోపేతం చేస్తుందని ప్రధాని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, 2025 గణతంత్ర దినోత్సవ వేడుకలకు ప్రబోవో సుబియాంతో ముఖ్య అతిథిగా భారత్‌కు విచ్చేసిన సంగతి తెలిసిందే. ఇండోనేషియా పర్యటనలో భాగంగా ప్రధాని మోదీ అక్కడ నివసిస్తున్న భారతీయ సమాజంతో ముఖాముఖి మాట్లాడనున్నారు. అలాగే అధ్యక్షుడు ప్రబోవోతో కలిసి యోగ్యకర్తలోని ప్రసిద్ధ 'ప్రాంబనన్' ఆలయ సముదాయాన్ని సందర్శించనున్నారు.


ఆస్ట్రేలియాలో కీలక చర్చలు:

ఇండోనేషియా పర్యటన ముగించుకుని ప్రధాని మోడీ నేరుగా మెల్‌బోర్న్ చేరుకుంటారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ ఆహ్వానం మేరకు ఆయన ఈ పర్యటన చేపట్టారు. ఇరు దేశాల మధ్య రక్షణ, భద్రత, వాణిజ్యం-పెట్టుబడులు, విద్య, మొబిలిటీ, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీలు, క్రీడలు, ప్రజా సంబంధాల వంటి కీలక అంశాలపై చర్చలు జరగనున్నాయి. ఈ పర్యటన భారత్-ఆస్ట్రేలియా వ్యూహాత్మక బంధాన్ని సరికొత్త ఎత్తుకు తీసుకెళ్తుందని ప్రధాని పేర్కొన్నారు. అక్కడ కూడా ఆయన భారత సంతతి ప్రజలతో భేటీ కానున్నారు.

40 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌కు భారత ప్రధాని:

పర్యటన చివరి దశలో ప్రధాని మోదీ న్యూజిలాండ్‌లోని ఆక్లాండ్‌కు చేరుకుంటారు. ఆ దేశ ప్రధానమంత్రి క్రిస్టోఫర్ లక్సన్ ఆహ్వానం మేరకు ఈ పర్యటన సాగనుంది. గత ఏడాది మార్చిలో పీఎం లక్సన్ భారత్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన కల్పించిన సానుకూల వాతావరణాన్ని ముందుకు తీసుకెళ్తూ.. ఆర్థిక, వాణిజ్య, వాణిజ్యపరమైన భాగస్వామ్యాలపై ఇరు దేశాల నేతలు చర్చించనున్నారు. నాలుగు దశాబ్దాల తర్వాత ఒక భారత ప్రధాని న్యూజిలాండ్‌లో పర్యటించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

# హార్పిక్‌తో హత్య



న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) పర పురుషుడి వ్యామోహంలో పడి, వివాహేతర సంబంధాలకు అలవాటు పడిన భార్యలు, అమాయకులైన భర్తల ప్రాణాలను గాలిలో కలిపేస్తున్నారు. ఈ క్రమంలోనే తెలంగాణలోని నిజామాబాద్ జిల్లాలో దారుణం వెలుగుచూసింది. తన వివాహేతర సంబంధానికి అడ్డుగా ఉన్నాడని ఓ భార్య కట్టుకున్న భర్తను అత్యంత కిరాతకంగా అంతమొందించింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణ శివారు ప్రాంతంలో నివసిస్తున్న ప్రశాంత్, సంధ్య దంపతులు నివాసం ఉంటున్నారు. అయితే, గత కొంతకాలంగా ఇద్దరిమధ్య గొడవలు జరుగుతున్నాయి. సంధ్యకు మరో వ్యక్తితో ఉన్న వివాహేతర సంబంధమే ఇందుకు కారణంగా తెలుస్తోంది. ఈ క్రమంలో భర్తను ఎలాగైనా శాశ్వతంగా వదిలించుకోవాలని సంధ్య పక్కా స్కెచ్ వేసింది. పథకం ప్రకారం భర్త ప్రశాంత్‌కు అతిగా మద్యం తాగించింది. అతడు పూర్తిగా మత్తులోకి జారుకున్నాక ప్రియుడిని ఇంటికి పలిపించి ఇద్దరూ తీవ్రంగా దాడి చేసి భవనం మీద నుంచి మొదట కిందకు తోసేశారు. ఈ ప్రమాదంలో ప్రశాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి, కానీ ప్రాణాలు మాత్రం పోలేదు.

నరాల్లోకి టాయిలెట్ క్లీనర్ ఇంజెక్ట్..

అయితే, దాడి చేసిన భవనం పైనుంచి తోసేసినా.. ప్రశాంత్ ఇంకా బతికే ఉన్నాడని, శ్వాస తీసుకుంటున్నాడని సంధ్య గమనించింది. ఎలాగైనా అతడని అంతమొందించాలనే కసితో ఇంట్లో బాత్‌రూమ్‌లో ఉన్న టాయిలెట్ క్లీనర్ హార్పిక్ లిక్విడ్‌ను ఓ సిరంజిలోకి తీసుకుని ప్రశాంత్ నరాల్లోకి నేరుగా ఎక్కించింది. శరీరంలోకి విషపూరితమైన క్లీనర్ చేరడంతో ప్రశాంత్ కొద్దిసేపటికే అత్యంత దారుణమైన స్థితిలో ప్రాణాలు విడిచాడు. అయితే, భార్య సంధ్యపై అనుమానం వచ్చిన ప్రశాంత్ కుటుంబ సభ్యులు పోలీసులు సమాచారం అందజేయగా.. వారు స్పాటు చేరుకుని భార్య సంధ్య, ప్రియుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లుగా తెలుస్తోంది. అయితే, వివాహేతర బంధం కోసం అగ్ని సాక్షిగా తాళి కట్టిన భర్తనే దారుణంగా హతమార్చిన విషయం విని జిల్లా ప్రజలు.. ఇదేం పని అంటూ ముక్కున వేలేసుకుంటున్నారు.

# ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్ర భగ్నం..



న్యూస్ డెస్క్, 06 జూలై (టీజీ 24): దేశ రాజధాని ఢిల్లీలో మరో భారీ ఉగ్రకుట్రను స్పెషల్ పోలీస్ అధికారులు భగ్నం చేశారు. ఢిల్లీలో దాడికి పాకిస్తాన్ ఐఎస్ఐ పన్నిన వ్యూహాన్ని ఈ ప్రత్యేక విభాగం సమర్థవంతంగా తిప్పికొట్టింది. పాకిస్తాన్ కేంద్రంగా పనిచేస్తున్న గ్యాంగ్‌స్టర్-టర్న్‌డ్-టెర్రరిస్ట్ షహజాద్ భట్టి గూఢచార నెట్‌వర్క్‌కు చెందిన రెండు వేర్వేరు మాడ్యూళ్లను పోలీసులు విజయవంతంగా ధ్వంసం చేశారు. ఈ ఆపరేషన్‌లో భాగంగా ఢిల్లీ, పంజాబ్ సరిహద్దు ప్రాంతాలలో ఏకకాలంలో దాడులు నిర్వహించి నలుగురు కీలక నిందితులను అరెస్ట్ చేశారు.

ధార్మిక స్థలాలు, పోలీస్ స్టేషన్లపై రెక్కీ..

పోలీసుల కథనం ప్రకారం.. ఈ ఉగ్ర నెట్‌వర్క్ రెండు విభిన్న విభాగాలుగా పనిచేస్తోంది. ఒకటి ఢిల్లీ-ఎన్‌సీఆర్ పరిధిలో దాడులకు ప్లాన్ చేసే ఉగ్రవాద విభాగం కాగా, రెండోది పాక్ సరిహద్దుల నుంచి డ్రోన్ల ద్వారా ఆయుధాలు, మత్తు పదార్థాలను సరఫరా చేసే ఆయుధాల అక్రమ రవాణా విభాగం. అరెస్ట్ అయిన వారిలో పంజాబ్‌కు చెందిన ముగ్గురితో పాటు ఢిల్లీలో పట్టుబడిన గగన్‌ప్రీత్ అనే నిందితుడు ఉన్నాడు. ఈ గగన్‌ప్రీత్ దిల్లీలోని సున్నితమైన ధార్మిక స్థలాలు, పోలీస్ స్టేషన్లు, భద్రతా తనిఖీ కేంద్రాల వద్ద వీడియోలు తీస్తూ ముమ్మరంగా రెక్కీ నిర్వహించినట్లు దర్యాప్తులో తేలింది. ఇక్కడ భారీగా కాల్పులు జరిపేందుకు అతనికి పాక్ హ్యాండ్లర్లు విదేశీ నంబర్ల ద్వారా ఆదేశాలు ఇచ్చారు.

అత్యాధునిక విదేశీ తుపాకులు స్వాధీనం..

నిందితుల నుంచి పోలీసులు జిగానా రకానికి చెందిన అత్యాధునిక విదేశీ పిస్టళ్లు, తొమ్మిది లైవ్ బుల్లెట్లు, హ్యాండ్లర్లతో మాట్లాడేందుకు ఉపయోగించిన ఐదు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పంజాబ్ యువతను సోషల్ మీడియా ద్వారా ట్రాప్ చేసి, వారికి ఆయుధాలు అందించి దేశంలో అశాంతి సృష్టించేందుకు షహజాద్ భట్టి కుట్ర పన్నినట్లు ఢిల్లీ పోలీస్ డిప్యూటీ కమిషనర్ ప్రవీణ్ కుమార్ త్రిపాఠి వెల్లడించారు. నిందితులపై భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టం కింద కేసులు నమోదు చేసి, ఈ అంతర్రాష్ట్ర ముఠా వెనుక ఉన్న మరికొందరు స్థానిక లింకుల కోసం పోలీసులు ముమ్మరంగా గాలిస్తున్నారు.

# పహల్గాం ఉగ్రదాడి కేసులో కీలక పరిణామం

మొదటి పేజీ తరువాయి



జమ్మూలోని ఎన్ఐఏ ప్రత్యేక కోర్టులో సమర్పించిన ఈ సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌లో హాఫీజ్ సయీద్‌ను వ్యక్తిగత హోదాలోనూ, అలాగే నిషేధిత ఉగ్రవాద సంస్థ జామ/ఏ=ఖీ చీఫ్‌గానూ ఎన్ఐఏ నిందితుడిగా చేర్చింది.

భారత్‌పై యుద్ధం ప్రకటించినట్లుగా గుర్తింపు

సయీద్‌పై భారతీయ న్యాయ సంహిత-2023, చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం-1967 లోని పలు కఠినమైన సెక్షన్ల కింద ఎన్ఐఏ అభియోగాలు మోపింది. సరిహద్దు అవతలి నుంచి భారతదేశానికి వ్యతిరేకంగా యుద్ధం ప్రకటించడం, ఉగ్ర కుట్రలు పన్నడం వంటి నేరాలకు సంబంధించిన సెక్షన్లను కూడా ఈ ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. గతంలో దాఖలు చేసిన 1,597 పేజీల ప్రధాన ఛార్జ్‌షీట్‌కు కొనసాగింపుగా ఈ అదనపు ఛార్జ్‌షీట్‌ను ఎన్ఐఏ దాఖలు చేసింది. ఇందులో పాకిస్తాన్ పన్నిన కుట్రలు, హాఫీజ్ సయీద్ కీలక పాత్ర, మరియు క్షేత్రస్థాయి విచారణ, శాస్త్రీయ ఆధారాలను ఎన్ఐఏ పక్కాగా పొందుపరిచింది. కాగా, 22 ఏప్రిల్ 2025న జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గామ్‌లో పాక్ మద్దతు ఉన్న ఉగ్రవాదులు మత ప్రాతిపదికన టార్గెట్ చేసి దారుణ ఊచకోతకు పాల్పడ్డారు. ఈ దాడిలో 25 మంది అమాయక పర్యాటకులు, ఒక స్థానిక పౌరుడు ప్రాణాలు కోల్పోయారు.

# అయోధ్య విరాళాల చోరీ కేసు..

మొదటి పేజీ తరువాయి



ట్విస్ట్ ఏంటంటే.. చంపత్ రాయ్, అనిల్ మిశ్రాలను సిట్, అయోధ్య పోలీసులు ఇప్పటికే సుదీర్ఘంగా విచారించినప్పటికీ, ఇప్పటివరకు వారిపై ఎలాంటి ప్రథమ సమాచార నివేదిక నమోదు కాలేదు. కేవలం నైతిక బాధ్యత వహిస్తూనే వారు తమ పదవులకు రాజీనామా చేశారు.

డ్రైవర్‌తో సహా ఎనిమిది మంది అరెస్ట్ఈ నిధుల చోరీ వ్యవహారంలో చంపత్ రాయ్ అత్యంత ఆప్తుడు, ఆయన మాజీ డ్రైవర్ అయిన రమాశంకర్ అలియాస్ టిన్ను యాదవ్‌తో పాటు హుండీ నగదు లెక్కింపు ప్రక్రియలో ఉన్న ఎనిమిది మంది సిబ్బందిని సిట్ ఇప్పటికే అరెస్ట్ చేసింది. హుండీ లెక్కింపు గదిలోని సీసీటీవీ కెమెరాలకు అడ్డం పడుతూ, అత్యంత తెలివిగా నోట్ల కట్టలను దొంగిలించి బాత్‌రూమ్‌లలో దాచి, ఆపై బయటకు తరలించేవారని సిట్ దర్యాప్తులో తేలింది.

# రికార్డు స్థాయికి రైతు భరోసా!

మొదటి పేజీ తరువాయి

ఈ మొత్తం వ్యయంలో 2018 నుంచి 2023 వరకు గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో దాదాపు రూ. 50,250 కోట్లు పంపిణీ చేయగా.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి ఇప్పటివరకు మరో రూ. 23,070 కోట్లను విజయవంతంగా విడుదల చేసింది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద సుమారు 9 లక్షల మంది నిరుపేద వ్యవసాయ కూలీలను చేర్చారు. గతంలో భూమి ఉన్నవారికే సాయం దక్కే విధానం ఉండగా.. ఇప్పుడు నిజమైన కౌలు రైతులు, కూలీలకు కూడా ఆర్థిక అండ లభిస్తోంది. దీనివల్ల రాష్ట్ర బడ్జెట్‌పై వార్షిక భారం పెరిగినప్పటికీ, నిరుపేద రైతులకు నేరుగా నగదు బదిలీ జరుగుతోందని అధికారులు స్పష్టం చేశారు. జిల్లా వారీగా పరిశీలిస్తే, అత్యధికంగా నల్గొండ జిల్లాకు రూ. 5,491 కోట్ల గరిష్ట నిధులు అందగా.. ఆ తర్వాత స్థానాల్లో సంగారెడ్డి, ఖమ్మం, నాగర్‌కర్నూల్ జిల్లాలు నిలిచాయి. అత్యల్పంగా వ్యవసాయ భూములు లేని హైదరాబాద్ జిల్లా చివరి స్థానంలో ఉంది.

ఇదిలా ఉండగా.. ఈ ప్రతిష్టాత్మక పథకాన్ని మరింత పారదర్శకంగా అమలు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. అర్హత లేని బోగస్ లబ్ధిదారులను, సాగులో లేని భూములను ఈ జాబితా నుండి తొలగించే ప్రక్రియను అధికారులు ముమ్మరం చేశారు. డేటాబేస్‌ను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయడం ద్వారా ప్రభుత్వ సహాయం నిజమైన రైతులకు, కూలీలకు మాత్రమే చేరేలా పక్కా నిబంధనలను అమలు చేస్తున్నట్లు రెవెన్యూ వర్గాలు స్పష్టం చేశాయి. కాగా, ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన రైతు భరోసా నిధులను ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి విడుదల చేశారు. విడతల వారీగా ఈ డబ్బులు రైతుల ఖతాల్లో జమ కానున్నాయి.



# ఉద్యోగుల బదిలీలపై నిషేధం..

న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వ ఉద్యోగుల బదిలీలపై తాత్కాలిక నిషేధం విధిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. స్థానిక కేడర్ల వారీగా ఉద్యోగుల కేటాయింపు పూర్తయ్యే వరకు బదిలీలతో పాటు కొత్త నియామకాలు, పదోన్నతులు (ప్రమోషన్లు), డిప్యుటేషన్లపై కూడా నిషేధం అమల్లో ఉంటుందని స్పష్టం చేసింది. ప్రభుత్వ ఉద్యోగుల స్థానిక కేడర్ల నిర్ధారణ, కేడర్ సంఖ్య ఖరారు, ఉద్యోగుల పంపిణీ, అమలు మార్గదర్శకాలకు సంబంధించి ప్రభుత్వం జీవో విడుదల చేసింది. 'రాష్ట్రపతి ఉత్తర్వు--2025' ప్రకారం రాష్ట్రంలోని 26 జిల్లాలకు స్థానిక కేడర్లను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించింది.

అయితే, మార్కాపురం, పోలవరం జిల్లాలు ప్రస్తుతం రాష్ట్రపతి ఉత్తర్వు--2025 పరిధిలోకి రావని ప్రభుత్వం పేర్కొంది. ఈ రెండు జిల్లాలకు తాత్కాలికంగా ఉద్యోగులను కేటాయిస్తామని స్పష్టం చేసింది.

ఆంధ్రప్రదేశ్‌ను 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజన

కొత్త జోనల్ విధానం ప్రకారం రాష్ట్రాన్ని 6 జోన్లు, 2 మల్టీ జోన్లుగా విభజిస్తూ ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసింది.

మల్టీ జోన్ - 1

జోన్-1: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు

జోన్-2: తూర్పు గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి

జోన్-3: ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు

ఈ జోన్‌లో అమరావతి రాజధాని ప్రాంతం కూడా ఉంటుంది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాల మధ్య పోస్టుల పంపిణీకి ప్రత్యేక నిష్పత్తి అమలు చేయనున్నారు.

మల్టీ జోన్ - 2

జోన్-4: బాపట్ల, ప్రకాశం, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు

జోన్-5: తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, వైఎస్సార్ కడప

జోన్-6: నంద్యాల, అనంతపురం, కర్నూలు, శ్రీ సత్యసాయి

కర్నూలు, నంద్యాల జిల్లాల మధ్య పోస్టులను 55:45 నిష్పత్తిలో పంపిణీ చేయనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ఇక, ఈ మార్గదర్శకాలు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, సచివాలయం, హెచ్‌వోడీ కార్యాలయాలు, హైకోర్టు పోస్టులకు వర్తించవని ప్రభుత్వం స్పష్టం చేసింది.

# టూరిజంపై సీఎం ప్రత్యేక ఫోకస్



న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) తెలంగాణలో పర్యాటక రంగ అభివృద్ధిపై సీఎం రేవంత్ రెడ్డి ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఎంసీహెచ్ఆర్‌డీ బోధి పెవిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సీఎంఓ ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, పర్యాటక శాఖ కార్యదర్శి వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై పలు కీలక ఆదేశాలు జారీ చేసిన సీఎం.. తారామతి బారాదరిని మరింత ఆకర్షణీయమైన పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచించారు. అలాగే దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేసి దేశ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇంకా మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయాలని సూచించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను ప్రముఖ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని, అక్కడి వీరభద్రస్వామి దేవాలయాన్ని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

అటవీ శాఖ పరిధిలోని భూములను పర్యాటక శాఖతో సమన్వయం చేసుకుని ఎకో టూరిజం ప్రాజెక్టులుగా అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో నగరంలో మరిన్ని ఎకో పార్కులను ఏర్పాటు చేయాలని, ఫ్యూచర్ సిటీ పరిధిలోని అటవీ భూములను అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. అర్బన్ ఫారెస్ట్ నమూనాలో ప్రత్యేక ప్రాజెక్టులను చేపట్టి, వాటి అమలును వేగవంతం చేసేందుకు ప్రత్యేక అధికారిని నియమించాలని ఆదేశించారు.

మరోవైపు హైదరాబాద్ నగర చారిత్రక వారసత్వాన్ని పర్యాటక రంగానికి అనుసంధానం చేసే దిశగా పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జ్‌ను అభివృద్ధి చేయాలని సీఎం సూచించారు. ఈ వంతెనపై పర్యాటకుల కోసం ప్రత్యేక సౌకర్యాలు కల్పించాలని, అవసరమైతే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటక కార్యకలాపాలకు అవకాశం కల్పించాలని అధికారులకు తెలిపారు. అదేవిధంగా ఈ ఏడాది డిసెంబర్‌లో నిర్వహించనున్న గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌కు సంబంధించిన ఏర్పాట్లను ఇప్పటి నుంచే ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. సమ్మిట్ విజయవంతం కోసం వివిధ శాఖల మధ్య సమన్వయం కల్పించేలా ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసి కార్యాచరణను వేగవంతం చేయాలని సూచించారు.

# మహారాష్ట్రను ముంచెత్తిన వర్షం

న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) దేశ ఆర్థిక రాజధాని మహారాష్ట్రను భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. రాష్ట్రంలోని అన్ని నగరాల్లో కుంభవృష్టి కురుస్తోంది. ముంబై-పూణె నేషనల్ హైవే నీటమునిగిపోయవడంతో వందలాది వాహనాలు రోడ్డున నిలిచాయి. హైవేపై వరుసగా కొండచరియలు విరిగిపడటంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. ఏకధాటిగా కురుస్తున్న వర్షాలకు రోడ్లు, కాలనీలు, రైల్వే ట్రాకులు సైతం చెరువులను తలపిస్తున్నాయి. దీంతో జనజీవనం పూర్తిగా స్తంభించింది. గత మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న కుండపోత వానల కారణంగా ముంబై, పాల్ఘర్, రాయ్‌గఢ్ జిల్లాల్లో వేర్వేరు ప్రమాదాల్లో ఇప్పటివరకు 13 మంది ప్రాణాలు కోల్పోయారు. ముంబయి దాని పరిసర ప్రాంతాలకు భారత వాతావరణ శాఖ అత్యంత ప్రమాదకరమైన 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. ప్రముఖ పర్యాటక ప్రాంతం లోనావాలాలో రికార్డు స్థాయిలో 670 మిల్లీమీటర్ల అత్యంత భారీ వర్షపాతం నమోదైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ పరిస్థితులపై మహారాష్ట్ర విపత్తు నిర్వహణ శాఖ మంత్రి గిరీష్ మహాజన్ సోమవారం అధికారిక ప్రకటన చేశారు. రాష్ట్రంలో వరదలు, కొండచరియలు విరిగిపడటం వల్ల భారీ నష్టం వాటిల్లిందని ఆయన పేర్కొన్నారు.

# రావణ్‌లో మావోయిస్టు భావజాలం..

న్యూస్ డెస్క్, 06 జూలై ( బి ఎన్ ఎస్) ప్రశ్న రావణ్ లో మావోయిస్టు భావజాలం ఉన్నట్లు రిమాండ్ రిపోర్టులో పోలీసులు స్పష్టం చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేసులో ఆయన్ను రిమాండ్‌కు తరలించిన విషయం తెలిసిందే. అయితే రిమాండ్ రిపోర్టులో పొందుపర్చిన కీలక విషయాలు తాజాగా వెలుగులోకి వచ్చాయి. రావణ్ ఫోన్‌ను పరిశీలించడంతో అందులో మావోయిస్టు భావజాలం ఉన్నట్లు తాము గుర్తించామని తెలిపారు. అలాగే మావోయిస్టు హిడ్మాను రావణ్ కీర్తిస్తూ ప్రసంగించిన వీడియోలు సైతం ఫోన్‌లో ఉన్నట్లు వెల్లడించారు. అంతేకాదు హిందూ దేవుళ్లే టార్గెట్‌గా రావణ్ పని చేస్తున్నట్లు పేర్కొన్నారు. దేవుళ్లను కించపర్చడం, అవమానించడంలో భాగంగానే తాను రావణ్ అనే పేరు పెట్టుకున్నారని వివరించారు. మత, కుల పరమైన విభేదాలు రెచ్చగొట్టేలా వ్యవహరిస్తున్నారని, రాష్ట్రంలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా ప్రసంగాలు, పదవుల్లో ఉన్న వారిని దూషించడం, వ్యవస్థలపై ద్వేషం కలిగించేలా రావణ్ తీరు ఉందని తెలిపారు. అంతేకాదు అసలు రావణ్‌కు సహకరిస్తున్న వారెవరో కూడా తేలాల్సి ఉందని, విచారణకు కూడా ఆయన సహకరించలేదని పోలీసులు రిమాండ్ రిపోర్టులో పేర్కొన్నారు.

ప్రశ్న రావణ్‌కు రిమాండ్

కాగా యూట్యూబర్ బచ్చలకూరి జోసెఫ్ అలియాస్ ప్రశ్న రావణ్‌ను పవన్ కల్యాణ్‌పై చేసిన అసభ్య కామెంట్స్ కేసులో గన్నవరం కోర్టులో ప్రవేశ పెట్టడంతో ధర్మాసనం 14 రోజుల రిమాండ్ విధించింది. ఆయనపై గన్నవరం పోలీస్ స్టేషన్‌లో ఉపా సెక్షన్ల కింద కేసు నమోదు అయింది. జనసేన నాయకుడు గరికపాటి శివశంకర్ ఇచ్చిన ఫిర్యాదుతో నమోదైన ఈ కేసులో రావణ్‌ను అరెస్ట్ చేసి ఈ నె 18 వరకు విధించిన రిమాండ్ నేపథ్యంలో పోలీసులు

## కరుణామయి విద్యాలయంలో ఉచిత నోట్ బుక్స్, మరియు స్టడీ మెటీరియల్స్ పంపిణీ




నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్): –నెల్లూరు జిల్లా రాపూరు మండలంలోని గోనుపల్లి మరియు మల్లమ్మగుంట గ్రామాల్లో ఉన్న శ్రీకరుణామయి విద్యాలయల్లో ఒకటవ తరగతి నుంచి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్, నోట్ బుక్స్ ను పెంచలకొన ఆశ్రమం నిర్వాహకులు విజయ భరత్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా ఆయన మాట్లాడుతూ శ్రీశ్రీశ్రీ విజయేశ్వరిదేవి అమ్మవారి ఆస్సిశులతో నిర్వహించబడుతున్న పాటశాలలోఉన్న విద్యార్థిని విద్యార్థులకు క్రమశిక్షణ అంకిత భావం కలిగి చక్కగా చదివి పాఠశాలకు మరియు తల్లీతండ్రులకు,శ్రీవిజయేశ్వరీ దేవి అమ్మకి కీర్తి ప్రతిష్టలు తేవాలని కోరారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు మస్తాన్ రావ్, పి.శంకరయ్య,మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శేరిలింగంపల్లి జోన్ నార్సింగి సర్కిల్-45 పరిధిలో అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలన - జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్

శేరిలింగంపల్లి జోన్లో నార్సింగి సర్కిల్–45 పరిధిలోని కీలక అభివృద్ధి పనులను సందర్శించి పురోగతిని క్షేత్రస్థాయిలో శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ ఐఏఎస్ పరిశీలించడం జరిగింది.



ఈ సందర్భంగా కింది పనులను సందర్శించి అధికారులతో సమీక్షించడం జరిగింది:

- ఆల్కాపూర్ పార్క్–2
- సర్దార్ పటేల్ పార్క్
- గోల్డెన్ మైల్ రోడ్ జంక్షన్
- నేక్నంపూర్ చిన్న చెరువు సరస్సు పునరుజ్జీవన ప్రతిపాదన
- VUE జంక్షన్

పనుల పురోగతిని సమీక్షించిన అనంతరం, అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించడం జరిగింది. అదే సమయంలో పనుల నాణ్యతలో ఎలాంటి రాజీకి తావు లేకుండా అత్యున్నత ప్రమాణాలతో చేపట్టాలని సూచించడం జరిగింది.

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందించేందుకు ఈ అభివృద్ధి పనులు కీలకమని, వాటిని వేగంగా పూర్తి చేసేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగింది.

# రన్నింగ్లో ఊడిన స్కూల్ బస్సు టైర్లు

కడప జిల్లా పులివెందులలో పెను ప్రమాదం తప్పింది. ఓ స్కూల్ బస్సు విద్యార్థులను ఎక్కించుకొని వెళ్తుండగా మార్కెట్ యార్డ్ స్పీడ్ బ్రేకర్ వద్ద ఉన్నట్టుండి 2 టైర్లు ఊడిపోయాయి. బస్సు వేగం తక్కువగా ఉండటంతో ప్రమాదం తప్పింది. ఘటన సమయంలో బస్సులో 30 మందికి పైగా విద్యార్థులు ఉన్నారు. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలు చదివే స్కూళ్లలో బస్సుల ఫిట్నెస్ గురించి ఆరా తీస్తే ఇలాంటి ప్రమాదాలను అరికట్టొచ్చు.




## 33,48,115/- సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 06:

రాష్ట్ర ప్రజలందరికీ మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అహర్నిశలు కృషి చేస్తూ పేదల జీవితాల్లో వెలుగులు నింపాలి అనే లక్ష్యంతోనే సీఎం రిలీఫ్ ఫండ్ పథకం అందజేస్తున్నట్లు టిడిపి జిల్లా అధ్యక్షుడు చదిపిరాళ్ల భూపేష్ రెడ్డి పేర్కొన్నారు. అనంతరం ముఖ్యమంత్రి సహాయనిధి పథకం కింద 46 మంది లబ్ధిదారులకు దాదాపు రూ.33,48,115/- విలువ చేసే సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం భూపేష్ రెడ్డీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో పేద, ధనిక అనే తేడా లేకుండా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించేందుకు సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ద్వారా ఖర్చు చేసిన డబ్బులను తిరిగి లబ్దిదారులకు అందజేస్తున్నారని తెలిపారు. పేదల పాలిట వరంలా సీఎం రిలీఫ్ ఫండ్ పథకం ఉందని భూపేష్ తెలిపారు. రాష్ట్రంలోని ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని రకాల సంక్షేమ పథకాలు ఎన్నికల్లో చెప్పినట్లు తూ,చ తప్పకుండా అమలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రాన్ని అన్ని రకాలుగా అభివృద్ధి చేసేందుకు ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, దేశ ప్రధాని నరేంద్ర మోడీతో కలిసి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలు అందేలా చూస్తామన్నారు. అలాగే జమ్మలమడుగు నియోజక వర్గంలో స్టీల్ ప్లాంట్, సోలార్ ఫ్యాక్టరీలు తదితర పరిశ్రమలు ఏర్పాటు చేసి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధ్యాయ అవకాశాలు కల్పించి నియోజకవర్గాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్డీఏ కూటమి, టిడిపి నాయకులు బిర్రు సంతోష్, లబ్ధిదారులు పాల్గొన్నారు

## ఘనంగా బాబు జగజ్జీవన్ రామ్ గారి వర్ధంతి వేడుకలు..



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 06: కడప నగరంలోని వైఎస్ఆర్సిపి జిల్లా పార్టీ కార్యాలయంలో భారత మాజీ ఉప ప్రధాని, నవభారత నిర్మాత, బాబు జగజ్జీవన్ రామ్ గారి వర్ధంతిని పురస్కరించుకొని ఆయనకు అత్యంత ఘనంగా నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం పార్టీ కార్యాలయ ఆవరణలోని స్వర్గీయ వైఎస్ రాజశేఖర రెడ్డి గారి విగ్రహానికి కూడా పూలమాలలు వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ముఖ్య నాయకులు,

రాష్ట్ర సిఈసి మెంబర్ కే. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం ఎస్.బి అంజాద్ బాషా, ఎమ్మెల్సీ రామచంద్ర రెడ్డి, కడప జిల్లా మహిళా అధ్యక్షులు

తెలుగుపులి వెంకటసుబ్బమ్మ ,

రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పులి సునీల్ కుమార్, మాజీ డిప్యూటీ మేయర్ నిత్యానంద రెడ్డి, కడప ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, కడప ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు కంచుపాటి బాబు,ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి అనుబంధ విభాగాల నేతలు, మహిళా ప్రతినిధులు మరియు పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొని బాబు జగజ్జీవన్ రామ్ గారి సేవలను, దేశానికి ఆయన చేసిన త్యాగాలను స్మరించుకుంటూ ఘన నివాళులు అర్పించారు.

## బీసీల అభ్యున్నతి తెలుగుదేశం పార్టీ లక్ష్యం



అమరావతి BNS జులై 6:బీసీల అభ్యున్నతే తెలుగుదేశం పార్టీ లక్ష్యమని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో బీసీలకు మరోసారి మంచి రోజులు ప్రారంభమయ్యాయని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ, బీసీ సంక్షేమం, విద్య, ఉపాధి, రాజకీయ సాధికారత, రాయలసీమ అభివృద్ధి, గత ప్రభుత్వ వైఖరిపై విస్తృతంగా మాట్లాడారు.

**మూడు బడ్జెట్లలో రికార్డు స్థాయి కేటాయింపులు :**

బీసీలు సమాజానికి వెన్నెముక అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విశ్వసిస్తున్నారని మంత్రి సవిత తెలిపారు. సమాజంలో సగానికి పైగా ఉన్న బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలి బడ్జెట్లో బీసీల సంక్షేమానికి రూ.39 వేల కోట్లు, రెండో బడ్జెట్లో రూ.47 వేల కోట్లు, మూడో బడ్జెట్లో రూ.51 వేల కోట్లు కేటాయించామని వెల్లడించారు. మూడు బడ్జెట్లలో కలిపి రూ.1.37 లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించడం చరిత్రలోనే తొలిసారని, బీసీల పట్ల ప్రభుత్వ చిత్తశుద్ధికి ఇదే నిదర్శనమని అన్నారు.

**ఎంజేపీ గురుకులాలకు అత్యున్నత ప్రాధాన్యం :**

రాష్ట్రంలో ప్రస్తుతం 109 మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల విద్యాసంస్థలు పనిచేస్తున్నాయని మంత్రి తెలిపారు. వాటిలో 56 బాలుర, 53 బాలికల గురుకులాలు ఉండగా, దాదాపు 50 వేల మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారని చెప్పారు. మరో 10 కొత్త ఎంజేపీ గురుకులాలను ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆరోగ్యం, భోజనం, భద్రతపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా సాంకేతిక విద్యను అందిస్తున్నామని పేర్కొన్నారు. గురుకులాల్లో ఒక్కో విద్యార్థిపై ప్రభుత్వం ఏడాదికి రూ.1.50 లక్షలు, బీసీ హాస్టళ్లలో ఒక్కో విద్యార్థిపై రూ.75 వేల వరకు వ్యయం చేస్తోందని చెప్పారు.

# మూగజీవుల సంరక్షణే మానవాళి రక్షణ..!

ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన సేవా సందేశం కార్యక్రమాన్ని పురస్కరించుకొని ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంలో మూగజీవుల సంరక్షణే మానవాళి రక్షణకు బలమైన పునాది అంటూ




జంతువులను కాపాడితేనే మనిషి ఆరోగ్యం సురక్షితం అని అవగాహన పెరిగితేనే జూనోసిస్ వ్యాధులకు అడ్డుకట్ట పడుతుందని గొప్ప సందేశంతో ప్రపంచ జూనోసిస్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జమ్మలమడుగు పట్టణంలోని నారాపుర వెంకటేశ్వర స్వామి ఆలయం ఎదురుగా ఉన్న ప్రభుత్వ పశు వైద్యశాలలో ఈరోజు ఉచిత రేబీస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి మే ఐ హెల్ప్ యూ ఫౌండేషన్ వ్యవస్థాపక ఛైర్మన్ మోరే లక్ష్మణ్ రావు పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూగజీవులపై ప్రేమ చూపించడం మన సంస్కృతి అని, వాటి ఆరోగ్యాన్ని కాపాడడం మన బాధ్యత అని రేబీస్ వంటి వ్యాధులను పూర్తిగా నివారించాలంటే ప్రతి పెంపుడు జంతువుకు సమయానికిటీకాలు వేయించాలన్నారు. జంతువుల ఆరోగ్యమే ప్రజారోగ్యానికి రక్షణ కవచం అన్నారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డా. ఆర్. శ్రీధర్ రెడ్డి, వెటర్నరీ సర్జన్లు డా. ఆర్.సుధాకర్, డా. కె. రమేష్ బాబు, జేవో బి.నాగేంద్ర , ఎల్ఎస్ఏ పి. సిరీష, ఏహెచ్ఏ వై.సుజాత, ఏహెచ్ఏ ఎస్. రమాదేవితో పాటు పశు సంవర్ధక శాఖ అధికారులు, సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## మత్స్యకారుల కుటుంబాలను పరామర్శించిన బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

విశాఖపట్నం BNS జూలై 6 : విశాఖ ఫిషింగ్ హార్బర్ నుంచి చేపల వేటకు వెళ్లి మత్స్యకారులు గల్లంతు కావడం అత్యంత దురదృష్టకరమని, వారిని క్షేమంగా తీసుకురావడానికి అన్ని ప్రభుత్వ యంత్రాంగాలు సమన్వయంతో పనిచేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ కోరారు.



సోమవారం విశాఖ ఫిషింగ్ హార్బర్కు చేరుకున్న ఆయన గల్లంతైన మత్స్యకారుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం, కేంద్ర సంస్థలు బాధిత కుటుంబాలకు అండగా ఉంటాయని భరోసా కల్పించారు.

అనంతరం మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్, నేవీ అధికారులు, జిల్లా కలెక్టర్తో ఘటనపై సమీక్ష నిర్వహించి గాలింపు చర్యల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. సముద్రంలో గల్లంతైన మత్స్యకారుల ఆచూకీ కోసం కోస్ట్ గార్డ్ నౌకలు, ఇతర రక్షణ బృందాలతో గాలింపును మరింత వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు.

వేటకు వెళ్ళే మత్స్యకారులు కు ప్రమాద భీమా తప్పనిసరి చేయాల్సిన అవసరం ఉంది

అదేవిధంగా లైఫ్ జాకెట్లు కు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అభివృద్ధి చేయాలి ఆవిధంగా చేస్తే వారి ఆచూకీ తెలుసు కోవడానికి మార్గం సులభంగా ఉంటుంది

మెకనైజ్డ్ బోట్లు కు జిపిఎస్ అందుబాటులోకి తీసుకు రావడం తో రక్షణ చర్యలు పర్య వేక్షణ పెంచాలి .

మత్స్యకారులు వేటకు వెళ్ళే మెకనైజ్డ్ బోట్లు కోస్టు గార్డ్ కార్యాలయానికి జిపిఎస్ విధానం అనుసంధానం చేయాలని సూచించారు మాధవ్

ప్రతి క్షణం విలువైనదేనని, గాలింపు చర్యల్లో ఎలాంటి అలసత్వం లేకుండా యుద్ధ ప్రాతిపదికన కొనసాగించాలని ఆయన అధికారులను కోరారు. గల్లంతైన మత్స్యకారులు క్షేమంగా తిరిగి రావాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు.

# శేరిలింగంపల్లిలో SIRపై సీఈవో వీడియో కాన్ఫరెన్స్

### సమయానుకూలంగా సారాంశ సవరణ పూర్తి చేయాలి..

### పారదర్శకంగా ఓటర్ల జాబితా నవీకరణకు ఆదేశం

శేరిలింగంపల్లి:( బిఎన్ఎస్) ఓటర్ల జాబితా ప్రత్యేక సారాంశ సవరణ (SIR) కార్యక్రమాన్ని గడువులోగా, ఎలాంటి లోపాలు లేకుండా పూర్తి చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈవో) అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం శేరిలింగంపల్లి జోన్ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్లో ఆయన జిల్లాల అధికారులతో సమీక్ష నిర్వహించారు.




ఈ వీడియో కాన్ఫరెన్స్లో శేరిలింగంపల్లి జోన్ జోనల్ కమిషనర్, ఎన్నికల నమోదు అధికారి (X) నారాయణ్ అమిత్, ఐఏఎస్.,తో పాటు అన్ని డివిజన్ల సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు పాల్గొన్నారు.

సీఈవో మాట్లాడుతూ ఓటర్ల జాబితాలో కొత్త నమోదులు, తొలగింపులు, సవరణలను క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఫారం–6, ఫారం–7, ఫారం–8 దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి నిర్ణీత గడువులోగా డేటా అప్డేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి మొత్తం ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.

ఈ సందర్భంగా నారాయణ్ అమిత్, ఐఏఎస్., శేరిలింగంపల్లి జోన్లో SIR కార్యక్రమం పురోగతిని వివరించారు. ఫారం–6, 7, 8 దరఖాస్తుల స్వీకరణ, బీఎల్వోల క్షేత్రస్థాయి తనిఖీలు, ఓటరు అవగాహన కార్యక్రమాలపై చేపడుతున్న చర్యలను సీఈవోకు వివరించారు.

సమావేశంలో అన్ని డివిజన్ల సూపర్వైజర్లు, ఏఈఆర్ఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఈగల అయ్యప్ప స్వామికి నష్టపరిహారం చెల్లించాలి...

మండపేట (బీఎన్ఎస్)జూలై :6. మండపేట మండలం ఏడిద గ్రామంలోని సురేంద్ర ఆయిల్ మిల్లులో విధి నిర్వహణలో తీవ్ర ప్రమాదానికి గురై కాలు విరిగిన రామచంద్రపురానికి చెందిన కార్మికుడు ఈగల స్వామి అయ్యప్పకు యాజమాన్యం వెంటనే రూ.4 లక్షల నష్టపరిహారం చెల్లించి, పూర్తి న్యాయం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య ( ఐఎఫ్టియు ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన కార్యదర్శి చీకట్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి బి.సిద్దు డిమాండ్ చేశారు. ఈ మేరకు బాధిత కార్మికుడు ఈగల స్వామి అయ్యప్పతో కలిసి రాజమహేంద్రవరం లో జిల్లా కలెక్టర్కు వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు.




ఈగల స్వామి అయ్యప్ప గత ఏడాది నుంచి సురేంద్ర ఆయిల్ మిల్లులో జట్టుతో కూలీగా పనిచేస్తున్నాడన్నారు. 2026 మే 20న మధ్యాహ్నం విధి నిర్వహణలో భాగంగా ట్రాక్టర్పై సుమారు 13 అడుగుల ఎత్తులో నుంచి లోడు దింపుతుండగా ప్రమాదవశాత్తు కిందపడటంతో అతని కుడికాలు తీవ్రంగా విరిగిపోయిందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ వెంటనే జోక్యం చేసుకుని ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధిత కార్మికుడికి న్యాయం చేయాలని ఐఎఫ్టియు డిమాండ్ చేసింది.

# ఓటరు జాబితా ప్రత్యేక సవరణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి..!

## స్వయం సహాయక సంఘాల సభ్యులకు పిలుపునిచ్చిన జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా జూలై 06: భారత ఎన్నికల సంఘం చేపడుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ఎస్ఐఆర్ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘాల సభ్యులు చురుకుగా పాల్గొని ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా రూపొందించేందుకు సహకరించాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఒక ప్రకటన ద్వారా కోరారు.

ఇప్పటికే ఎన్యుమరేషన్ ఫారం, ఈఎఫ్ పూరించిన వారు ఆలస్యం చేయకుండా తమ ఆర్‌పీ, యానిమేటర్ ద్వారా లేదా నేరుగా బూత్ స్థాయి అధికారి బీఎల్‌ఓకి అందజేయాలని సూచించారు. ఫారం సమర్పించని పక్షంలో డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో పేరు నమోదుకాకపోయే అవకాశం ఉంటుందని తెలిపారు. ఇంకా ఫారం పూరించని వారు వెంటనే ఆర్‌పీ, యానిమేటర్ సహాయంతో పూర్తి చేసి బీఎల్‌ఓకు సమర్పించాలని సూచించారు. ఫారం పూరించేందుకు బీఎల్‌ఓ అందించిన ఈఎఫ్ ఫారం, పాస్‌పోర్ట్ సైజు ఫోటో, మొబైల్ నంబర్, ఆధార్ నంబర్ ఐచ్ఛికం, అలాగే 2002లో కుటుంబ సభ్యులు ఓటరుగా నమోదై ఉంటే వారి వివరాలు అందుబాటులో ఉంచాలని తెలిపారు. 2002 నాటి ఓటరు వివరాలు తెలియకపోయినా, అప్పట్లో ఓటు వేసిన గ్రామం లేదా పట్టణం పేరు తెలిస్తే బీఎల్‌ఓ సహకారం అందిస్తారని పేర్కొన్నారు. ఫారంలో పుట్టిన తేదీ, తల్లిదండ్రుల వివరాలు, మొబైల్ నంబర్ వంటి వ్యక్తిగత వివరాలను పూర్తిగా నమోదు చేయాలని, ఓటరు లేదా కుటుంబంలోని వయోజన సభ్యుడి సంతకం లేదా బొటనవేలు ముద్ర తప్పనిసరిగా ఉండాలని, ఫోటో సక్రమంగా అతికించి పూర్తి చేసిన ఫారాన్ని బీఎల్‌ఓకు అందజేయాలని సూచించారు. ఇంకా ఓటరుగా నమోదు కాని అర్హులు అవసరమైన గుర్తింపు పత్రాలు, ఫోటోతో బీఎల్‌ఓను సంప్రదించి కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఈ కార్యక్రమంలో భాగస్వామి కావడం ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని, అందరూ బాధ్యతగా సహకరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.

# సైబరాబాద్ ట్రాఫిక్‌పై జాయింట్ సీపీ ఫోకస్

## వాటర్ లాగింగ్ పనులు వెంటనే పూర్తి చేయాలి.. రాంగ్ రూట్‌పై కఠిన చర్యలు

## గచ్చిబౌలి నుంచి ఐకియా ఫ్లైఓవర్ వరకు క్షేత్రస్థాయి పరిశీలన



సైబరాబాద్:(బిఎన్ఎస్) సైబరాబాద్‌లో ట్రాఫిక్‌ను మరింత సురక్షితంగా, సాఫీగా నిర్వహించేందుకు ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ సన్‌ప్రీత్ సింగ్, ఐపీఎస్., అధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాకాలంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వాటర్ లాగింగ్ ప్రాంతాల్లో పెండింగ్ పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. రాంగ్ రూట్ ప్రయాణాలు, ప్రమాదకర డ్రైవింగ్‌పై ప్రత్యేక నిఘా ఉంచి కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫ్రీ లెఫ్ట్‌ల వద్ద వాహనాల నిలుపుదలను అరికట్టి, యూ-టర్న్‌ల వద్ద ట్రాఫిక్ నిరంతరాయంగా సాగేలా చర్యలు చేపట్టాలని అధికారులకు స్పష్టం చేశారు. అనంతరం గచ్చిబౌలి విలేజ్, రాడిసన్ జంక్షన్, ఏఎంబీ మాల్, కొత్తగూడ, అంజయ్యనగర్, లేబర్ అడ్డా ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు.

బాటిల్‌నెక్ ప్రాంతాలకు శాశ్వత పరిష్కారాల కోసం కార్యాచరణ రూపొందించాలని ఆదేశించిన జాయింట్ సీపీ, కేబుల్ బ్రిడ్జి నుంచి ఐకియా ఫ్లైఓవర్ వరకు వీఐపీ మార్గాన్ని కూడా పరిశీలించి ట్రాఫిక్ ప్రవాహం మెరుగుపరిచే అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు.

# రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష



అమరావతి BNS జూలై 06: రియల్ టైమ్ గవర్నెన్స్ కేంద్రం నుంచి రియల్ టైమ్‌లోనే ప్రజల సమస్యలు, ఇబ్బందులపై రెస్పాన్స్ అందాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు దిశానిర్దేశం చేశారు. వేగంగా స్పందించగలిగితేనే పౌరులకు మెరుగైన సేవల్ని అందించగలుగుతామని ఆయన స్పష్టం చేశారు. సీఎస్ ఆధ్వర్యంలో మల్టీ డిపార్ట్మెంట్ కోఆర్డినేషన్ సమావేశం జరగాలి. విశాఖ సముద్రం తీరంలో బోటు మునిగి మత్స్యకారులు గల్లంతైన ఘటనలో తక్షణ స్పందనగా ఏఏ విభాగాలు ఎలా స్పందించాయన్నదే కీలకమని అన్నారు. ఆర్టీజీఎస్ కేంద్రం 24 గంటలూ ప్రజలకు సేవలందించేలా చర్యలు చేపట్టాలని సీఎం నిర్దేశించారు. 5 రోజుల జిల్లాల పర్యటన అనంతరం అమరావతికి చేరుకున్న ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పురపాలక, పంచాయితీరాజ్, హోం, ఎక్సైజ్ తదితర శాఖల ద్వారా అందిస్తున్న ప్రభుత్వ సేవలపై సమావేశంలో చర్చించారు. దీనిపై ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. "ఏఐ మెథడాలజీ ద్వారా చిత్తూరు జిల్లాలో సంతృప్తి స్థాయి నమోదు చేస్తున్నాం. అధికారులు క్షేత్రస్థాయి పర్యటనల వల్ల ప్రజాభిప్రాయం నేరుగా తెలుసుకునే అవకాశం ఉంటుంది. నియోజకవర్గస్థాయిలో లాస్ట్ మైల్ గవర్నెన్స్ ప్రజలకు అందాలి. రాష్ట్ర అభివృద్ధిలో ప్రజాపాలనలో పొలిటికల్ మేనేజ్మెంట్-బ్యూరోక్రటిక్ యాక్షన్ సమపాళ్లలో ఉండాలి. పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలి. వివిధ కేటగిరీలు, శాఖలకు చెందిన పీజీఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ఓ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలి. క్షేత్రస్థాయిలో ఫలితాలు కనిపించేలా కలెక్టర్లు, ఉన్నతాధికారులు భాద్యత తీసుకోవాలి." అని అన్నారు.

అన్ని ప్రభుత్వ శాఖలూ అవేర్ 2.0 ద్వారా ఏమేరకు ఫలితాలు వచ్చాయో విశ్లేషించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా కమ్యూనికేషన్ నెట్వర్క్ కనెక్టివిటీ కోసం మారుమూల ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేసేందుకు కార్యాచరణ చేపట్టాలన్నారు. ఆపరేటర్లను సంప్రదించి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సమీక్షకు మంత్రి కొలుసు పార్ధసారధి, సీఎస్ సాయి ప్రసాద్, డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పురపాలక, ఎక్సైజ్, పోలీసు ఉన్నతాధికారులు హాజరయ్యారు.



# విద్యార్థులకు అస్వస్థత

కామారెడ్డి జిల్లా బీర్కూరు మండల కేంద్రంలోని బాపూజీ పూలే బాలుర గురుకుల పాఠశాల లోనీ 12 మంది విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. కోడిగుడ్ల కూర తో భోజనం చేసిన అనంతరం విద్యార్థులకు ఫుడ్ పాయిజన్ అయి వాంతులు , విరేచనాలు కావడంతో పాఠశాల సిబ్బంది హుటాహుటిన విద్యార్థులను బాన్సువాడ లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. భోజనం వికటించడంతోనే విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు వైద్యులు క్రాంతి కుమార్ తెలిపారు. ప్రస్తుతం విద్యార్థుల ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు డాక్టర్ తెలిపారు. బాన్సువాడ ఆర్డీవో రవీందర్ రెడ్డి ఆస్పత్రి కి చేరుకొని విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అధికారులకు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని అన్నారు.

బి ఆర్ ఎస్ నాయకులు అంజిరెడ్డి ఆసుపత్రి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం హాయంలో నాణ్యమైన భోజనం అందించామని ప్రస్తుతం అన్నీ కల్తీ వస్తువులను గురుకుల పాఠశాలలో సరఫరా చేస్తున్నట్లు ఆయన ఆరోపించారు . దీంతో విద్యార్థులు అస్వస్థతకు గురవుతున్నారని ఆయన అన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు నాణ్యమైన ఆహార సరుకులను పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు .

# ఫెన్సింగ్ తొలగించి పునరావాసం కల్పించాలి

## అడ్డరోడ్డు ఆర్డీవో కార్యాలయం వద్ద చందనాడ గ్రామస్థుల ధర్నా

అనకాపల్లి జిల్లా,అడ్డరోడ్డు, జూలై 6: నక్కపల్లి మండలం చందనాడ ఎస్సీ, బీసీ కాలనీ వాసులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, పునరావాసం కల్పించాలని కోరుతూ సోమవారం అడ్డరోడ్డు ఆర్డీవో కార్యాలయం వద్ద గ్రామస్థులు ధర్నా నిర్వహించారు. అనంతరం తమ సమస్యలను వివరిస్తూ వినతిపత్రాన్ని డీటీ నానాజీకి అందజేశారు. ఆర్డీవో అందుబాటులో లేకపోవడంతో వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు సంబంధిత అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తామని హామీ ఇచ్చారు.

గ్రామస్థులు మాట్లాడుతూ, ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం చందనాడ గ్రామం చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయడంతో గ్రామానికి రాకపోకలు తీవ్రంగా ఇబ్బందికరంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ మార్గం లేకపోవడంతో ఉపాధి, విద్య, వైద్య అవసరాలకు తీవ్ర ఆటంకం ఏర్పడుతోందన్నారు. ఇప్పటికే సమీప గ్రామాల ప్రజలకు ఆర్ అండ్ ఆర్ కాలనీలో పునరావాసం కల్పించిన నేపథ్యంలో తమ కాలనీలను కూడా తరలించి, భూసేకరణ చట్టం ప్రకారం నష్టపరిహారం, ఆర్ కార్డులు, ఇంటి స్థలాలు, శాశ్వత ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. దళితుల డి-ఫారం, అసైన్మెంట్, గుల్లబట్టీల భూములు, స్మశాన భూములకు కూడా నష్టపరిహారం చెల్లించాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. అప్పలరాజు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం. రాజేష్, గ్రామ నాయకులు వై. సన్యాసి, వై. మన్నియ్య, పి. రమణ, వై. దేముడు, వై. శ్రీను, వై. ఏసు, కే. రాము, పి. సువర్ణరాజు, ఏ. ప్రశాంత్‌కుమార్, డీ. రాజు, కే. అచ్చారావు తదితరులు పాల్గొన్నారు.



# రైతులకు విత్తనాలు, ఎరువులు సకాలంలో అందించాలి

## ఎంపీడీవోకు వైఎస్సార్సీపీ నేతల వినతిపత్రం



అనకాపల్లి జిల్లా,జూలై 6 పాయకరావుపేట : ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన వరి విత్తనాలు,ఎరువులు రైతులకు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని వైఎస్సార్సీపీ రాష్ట్ర కార్యదర్శి,మాజీ జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు ఆధ్వర్యంలో నాయకులు ఎంపీడీవో అడపా లవరాజుకు సోమవారం వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా చిక్కాల రామారావు మాట్లాడుతూ,మండలంలోని రైతులకు అవసరమైన వరి విత్తనాల్లో 20 శాతం కూడా అందలేదని,ఎరువుల సరఫరా కూడా సక్రమంగా జరగక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెంటనే తగినంత విత్తనాలు,ఎరువులు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి సూరకాసుల గోవింద్,జిల్లా కార్యదర్శి పడాల గోవింద్,మండల రైతు విభాగం అధ్యక్షుడు కొనే పుత్రరావు,జడ్పీటీసీ లంక సూర్యనారాయణ,ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు,మండల అధ్యక్షుడు గెడ్డమూరి శ్రీనివాసరావు,టౌన్ అధ్యక్షుడు ధనిశెట్టి మహేష్,మాజీ సర్పంచులు పన్నీరు పాపారావు,చేపల తాతాజీ,పందిరి ధర్మాజీ,ఎంపీటీసీలు కొంతం నరేష్,యాగదాసు శేఖర్,పల్యాల లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

# శ్యామా ప్రసాద్ ముఖర్జీ జయంతి వేడుకలు.



చింతపల్లి బి ఎన్ ఎస్ న్యూస్ :- జూలై 6 భారతీయ జనసంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు, ప్రముఖ జాతీయవాది డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలను బీజేపీ చింతపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి, చింతపల్లి మండల ఇన్‌చార్జి పెనుమాక రవికుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అనంతరం రవికుమార్ మాట్లాడుతూ, డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ దేశ సమైక్యత, జాతీయ సమగ్రత కోసం జీవితాంతం కృషి చేసిన మహానీయుడని కొనియాడారు. భారతదేశ ఐక్యత, సమగ్రత కోసం ఆయన చేసిన త్యాగాలు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి బీజేపీ చింతపల్లి మండల అధ్యక్షుడు సాగెని బాలకృష్ణ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు లకే అబ్బాయిదొర, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు కదుళ్ల శ్రీనివాసరావు, తాజంగి నీటి సంఘం అధ్యక్షుడు బోనంగి బాలయ్య పడాల్, జిల్లా ఐటీ కన్వీనర్ పండా ఈశ్వరరావు, మండల ప్రధాన కార్యదర్శులు కిషోర్, మహేష్, మాతే లక్ష్మణ్‌తో పాటు మండల నాయకులు, వివిధ మోర్చాల బాధ్యులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదం తర్వాత దాడి..

## నిందితుడికి రిమాండ్




రోడ్డు ప్రమాదానికి కారణమై బాధితుడిపై దాడికి పాల్పడిన వ్యక్తిని గీసుగొండ సిఐ,డి. విశ్వేశ్వర్ అరెస్ట్ చేసి సోమవారం కోర్టులో హాజరుపర్చగా రిమాండ్ విధించారు. మచ్చాపురం గ్రామానికి చెందిన కంబాల వెంకటేష్ ఈ ఏడాది మే 21న అతివేగంగా బైక్ నడిపి అదే గ్రామానికి చెందిన బాల్తా బుచ్చిబాబును ఢీకొట్టాడు. ప్రశ్నించిన బాధితుడిపై పిడిగుద్దులతో దాడి చేసి, రాయితో కాలి పాదంపై కొట్టడంతో గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేసి జైలుకు తరలించారు.

# పాఠశాల ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన.

చింతపల్లి బి ఎం ఎస్ న్యూస్:-జూలై 6 పాఠశాల విద్యార్థులను రవాణా చేసే ఆటో డ్రైవర్లకు చింతపల్లి సీఐ సింహాచలం, ఎస్ఐ వీరబాబు పోలీస్ సిబ్బంది ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థుల భద్రతే ప్రధాన లక్ష్యంగా ఆటో డ్రైవర్లు తప్పనిసరిగా నిబంధనలు పాటించాలని సూచించారు.

డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ఎట్టి పరిస్థితుల్లోనూ ఆటోలు నడపరాదని, ప్రతి ఆటోకు రిజిస్ట్రేషన్, బీమా, ఫిట్‌నెస్, పర్మిట్ తదితర అవసరమైన పత్రాలు తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. సామర్థ్యానికి మించి విద్యార్థులను ఆటోలో ఎక్కించరాదని, పాఠశాల బ్యాగులను ఆటో బయట వైపున వేలాడదీసి ప్రయాణం చేయించడం ప్రమాదకరమని హెచ్చరించారు. అలాగే డ్రైవర్ పక్కన విద్యార్థులను కూర్చోబెట్టరాదని స్పష్టం చేశారు.

విద్యార్థుల భద్రత విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. ప్రతి ఆటో డ్రైవర్ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటిస్తూ విద్యార్థులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు.



# జీ వో 396 ని రద్దు చేయాలని దస్తావేజు లేఖర్ల పెన్ డౌన్

భీమునిపట్నం : విశాఖ అర్బన్ జిల్లా దస్తావేజు లేఖర్ల సంక్షేమ సంఘం పిలుపు మేరకు ప్రభుతం జారీ చేసిన 396 జీ వో ని రద్దు చేయాలని లేఖరుల స్టాంప్ వెండర్ల డి టి పి ఆపరేటర్ల ఉపాధిని కాపాడాలని దస్తావేజు లేఖరులువారి సహాయకులు

సోమవారం మంగళవారం పెన్ డౌన్ కార్యక్రమం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఏర్పాటు చేయవద్దనీ రిజిస్ట్రేషన్ శాఖ సేవలను ప్రైవేట్ పరం చేయవద్దని దస్తావేజు లేఖరుల లైసెన్స్ లు పునర్దించాలని ప్రజల ఆస్తులకు భద్రత కల్పించాలనివారు కోరారు.

ఈ కార్యక్రమంలో వి భాను, ఎ కిషోర్ బి.లక్ష్మీ బి వేణు గోపాల్ సాయి శ్రీను కామేశ్వర రావు కోటా వాసు, గణేష్, నాగేంద్ర, గోవింద్ సంతోష్ సుబ్రమణ్యం వాసు ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు

